సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
గురువారం। 2। మే। 2024



చీనీ టన్ను రూ.36 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో బుధవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.36 వేలు పలికాయి. మార్కెట్‌కు 655 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



చంద్రబాబు పచ్చి మోసకారి
అధికారం కోసం చంద్రబాబు ఎన్ని అబద్ధాలైనా చెబుతారని, టీడీపీ మేనిఫెస్టో మరోసారి రుజువు చేసిందని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అన్నారు. 8లో

గరిష్టం/కనిష్టం
43.6°/23.4°
జిల్లావ్యాప్తంగా బుధవారం గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉష్ణోగ్రతలు స్థిరంగా ఉండటంతో వడగాల్పుల తీవ్రత కొనసాగింది. గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

పోలింగ్ శాతం పెరగాలి

- ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు ఉండాలి
- జిల్లా ఎన్నికల అధికారి అరుణ్‌బాబు ఆదేశం

పుట్టపర్తి అర్బన్: ''రిటర్నింగ్ అధికారులు ముందస్తు ప్రణాళికలు రూపొందించుకుని ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలి. గతంతో పోలిస్తే ఈ సారి పోలింగ్ శాతం పెరగాలి. ఇందుకోసం అందరూ సమన్వయంతో పనిచేయాలి. ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేసే వాతావరణ కల్పించాలి'' అని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అరుణ్‌బాబు అన్నారు. బుధవారం ఉదయం ఆయన డీఆర్‌ఓ కొండయ్యతో కలిసి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి రిటర్నింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పలు ఎన్నికల అంశాలపై సమీక్షించి ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల విధుల్లో పని చేస్తున్న అన్ని నోడల్ టీంలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఇంకా ఎక్కడైనా పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పనకు సంబంధించన పనులు పెండింగ్ ఉంటే వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ఓటింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే వారందరికీ పోస్టల్ బ్యాలెట్ ఇస్తామన్నారు. పోస్టల్ బ్యాలెట్‌ను ఫెసిలేటషన్ కేంద్రాల్లో వినియోగించుకోవాలన్నారు. బీఎల్‌ఓల ద్వారా ఓటర్ స్లిప్పుల పంపిణీ వేగవంతం చేయాలన్నారు. 85 ఏళ్లు పైబడిన సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులు ఇంటివద్దే ఓటు వేసే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ కల్పించిందని, ఇందుకోసం అర్హులను గుర్తించి వారితో దరఖాస్తు చేయించాలన్నారు. అలాగే ఇప్పటికే అందిన దరఖాస్తులను ఆమోదించి హోం ఓటింగ్‌కు సత్వర చర్యలు చేపట్టాలన్నారు.

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా మంజువాణి


మంజువాణి (ఫైల్)

ప్రశాంతి నిలయం: శ్రీసత్యసాయి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్ఓ)గా డాక్టర్ పీఎస్ మంజువాణి నియమితులయ్యారు. బుధవారం ఆమె వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ డీఎంహెచ్ఓగా ఉన్న డాక్టర్ ఎస్వీ కృష్ణారెడ్డి మంగళవారం పదవీ విరమణ పొందారు. ఆయన స్థానంలో పెనుకొండ డిప్యూటీ డీఎంహెచ్ఓగా పనిచేస్తున్న డాక్టర్ పీఎస్ మంజువాణిని డీఎంహెచ్ఓగా నియమిస్తూ వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..జిల్లా ప్రజలకు ప్రభుత్వ ఆస్పత్రుల ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తానన్నారు.

అక్రమ మద్యం నిల్వలపై సమాచారం ఇవ్వండి

- జిల్లా ఎక్సైజ్ అధికారి సహదేవ

పుట్టపర్తి టౌన్: సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని జిల్లాలో మద్యం అక్రమ సరఫరాకు అడ్డుకట్ట వేయనున్నట్లు జిల్లా ఎక్సైజ్ అధికారి సహదేవ తెలిపారు. ఈ క్రమంలో ఎక్కడైనా మద్యం అక్రమ నిల్వలు, సరఫరా, సుంకం చెల్లించని మద్యం నిల్వలపై సమాచారం ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పొరుగు రాష్ట్రాల నుంచి అక్రమంగా మద్యం రవాణా ఉన్నా, సుంకం చెల్లించని మద్యం నిల్వలు ఉన్నా వెంటనే ఆఫీస్ ల్యాండ్‌నంబర్ 08555–292443, సెల్ నంబర్లు 86881 22134, 81799 56597కు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. అలాగే ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకూ ఎక్సైజ్ శాఖ మద్యం దుకాణాల నుంచి పెద్ద మొత్తంలో జరిగిన విక్రయాలను గుర్తించి 8మందిని అరెస్ట్ చేసి, కేసులు నమోదు చేశామన్నారు. ఈ కేసుల్లో ముగ్గురు సేల్స్‌మెన్లు, ఓ సూపర్‌వైజర్‌తో పాటు రాజకీయ సభల్లో పాల్గొన్న ముగ్గురిని విధుల నుంచి తొలగించినట్లు వివరించారు.

నిలువునా ముంచిన బాబు

వ్యవసాయం దండగ అని చెప్పిన చంద్రబాబు తన హయాంలో రైతులను రాచి రంపాన పెట్టాడు. సకాలంలో విత్తనాలు ఇవ్వకుండా రైతును మండల కేంద్రాల్లో రోడ్లపై పడిగాపులు కాసేలా చేశాడు. పంట నష్టపోతే పరిహారం ఊసే లేకుండా చేశాడు. చివర్లో చిల్లర విదిల్చి రైతాంగం నడ్డివిరిచాడు. రుణమాఫీ పేరుతో గద్దెనెక్కి ఆ ఊసే మరచిపోయాడు. అందుకే బాబు పాలన తలచుకుని రైతులు భయపడిపోతున్నారు. ఇప్పుడు నువ్వెన్ని చెప్పినా నమ్మలేం బాబూ అంటున్నారు.

- ఉమ్మడి జిల్లా రైతులకు బాబు 'బాకీ' రూ.5 వేల కోట్లు
- 2014–19 మధ్య ఇన్‌పుట్, ఇన్సూరెన్స్, రుణమాఫీ పెండింగ్
- ప్రధానంగా ఐదేళ్ల పాటు రైతు రుణ మాఫీ అవస్థలు వర్ణనాతీతం
- 'సుఖీభవ' అంటూ చివర్లో చిల్లరతో మోసపుచ్చిన చంద్రబాబు
- అందుకే 'నిన్ను నమ్మంబాబు' అంటున్న రైతాంగం

దగాపడి.. నిలబడి


రుణమాఫీకి నోచుకోకపోవడంతో అర్జీలు ఇచ్చేందుకు 2017 డిసెంబర్‌లో అనంతపురం మార్కెట్‌యార్డుకు తరలివచ్చిన రైతులు (ఫైల్)


2018లో ఆత్మకూరు మండలంలో ఎండిపోయిన వేరుశనగ పొలంలో దిగాలుగా కూర్చున్న రైతు (ఫైల్)

చంద్రబాబు జిల్లా రైతులకు ఎగ్గొట్టిన పరిహారం ఇలా...				
ఇన్‌పుట్‌సబ్సిడీ	ఇన్సూరెన్స్	రుణమాఫీ	ఇతరత్రా	మొత్తం
రూ2,460 కోట్లు	రూ. 1,200 కోట్లు	రూ.1,225 కోట్లు	రూ.115 కోట్లు	రూ.5 వేల కోట్లు

అనంతపురం అగ్రికల్చర్: టీడీపీ అధినేత చంద్రబాబు ఉమ్మడి అనంతపురం జిల్లా రైతులకు రూ.5 వేల కోట్లకు పైగా బాకీ ఉన్నాడు. 2014–19 మధ్య మూడోసారి ఐదేళ్ల పాటు ముఖ్యమంత్రిగా పాలించిన చంద్రబాబు... రైతులకు ఇవ్వాల్సిన ఇన్‌పుట్‌సబ్సిడీ, ఇన్సూరెన్స్, రుణమాఫీ, రైతు ఆత్మహత్యల పరిహారంతో పాటు మరికొన్ని పథకాల కింద సొమ్ము ఎగ్గొట్టినట్లు రైతులు వాపోతున్నారు. 2019 ఎన్నికల చివర్లో 'అన్నదాత సుఖీభవ' అంటూ ఒక్కో రైతుకు రూ.1,000 చొప్పున రూ.50 కోట్లు విదిల్చి పండుగ చేసుకోండంటూ దగా చేసిన వాస్తవాన్ని రైతులు ఇప్పటికీ జీర్ణించుకోలేకపోతున్నారు.

రైతు సంక్షేమాన్ని విస్మరించిన చంద్రబాబు..

14 ఏళ్ల పాటు సీఎంగా పనిచేసిన చంద్రబాబు ఏనాడూ రైతు సంక్షేమాన్ని పట్టించుకోలేదు. నేడు మళ్లీ ఎన్నికలు రావడంతో పచ్చమీడియా మాటున తన మార్కు జిమ్మిక్కులతో రైతులను మోసపుచ్చే యత్నాలు చేస్తున్న విషయాన్ని రైతులు గమనిస్తున్నారు. 2014 ఎన్నికల్లో రుణమాఫీ హామీతో రైతుల ఓట్లతో గద్దెనెక్కిన చంద్రబాబు ఇపుడు మరోసారి అధికారంలోకి రావడానికి చేస్తున్న కుటిల యత్నాలకు తిప్పికొట్టేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు.

రుణమాఫీ కష్టాలు అన్నీఇన్నీ కావు..

చంద్రబాబు ముఖ్యమంత్రిగా పనిచేసిన కాలంలో (2014–19) రైతులకు ఇవ్వాల్సిన సొమ్ము రూ.5 వేల కోట్లు ఉంది. ఎన్నికల సమయంలో ఆయన ఇచ్చిన హామీలు పరిగణనలోకి తీసుకుంటే రూ.10 వేల కోట్లు దాటుతుంది. అందులో ఒక్క రుణమాఫీ కిందనే రూ.5 వేల కోట్లకు పైగా ఉండటం విశేషం. 2014 ఎన్నికల సమయంలో రైతుకు సంబంధించిన అన్ని రకాల రుణాలు మాఫీ చేస్తానంటూ పలు మార్లు చెప్పిన చంద్రబాబు అధికారంలోకి రాగానే మాట మార్చేశారు. ఆయన అధికారంలోకి వచ్చే నాటికి 10.24 లక్షల ఖాతాల కింద రూ.6,817 కోట్లు ఉన్నాయి. హామీ మేరకు మొత్తం మాఫీ చేయాల్సి ఉంది. కానీ...కోటయ్య కమిటీ, కుటుంబరావు కమిషన్, స్కేల్ ఆఫ్ ఫైనాన్స్, కుటుంబ సభ్యుల పరిమితి, కుటుంబానికి రూ.లక్షన్నర అంటూ... రకరకాల నిబంధనలు, షరతులు విధించి ఏడాదిన్నర పాటు కాలయాపన చేయడంతో బ్యాంకుల్లో రైతుల అప్పు రెట్టింపైంది. అసలు, వడ్డీ కట్టలేక బంగారు నగలు విడిపించుకోలేక చాలా మంది అలాగే వదిలేయడంతో తీవ్రంగా నష్టపోయారు. ఏడాదిన్నర తర్వాత రూ.2,744 కోట్లు మాఫీ చేస్తానంటూ ప్రకటించారు. అదైనా చేశారా అంటే లేదు. విడతల వారీ అంటూ వన్‌టైం సెటిల్‌మెంట్‌తో పాటు మూడు విడతల్లో కొంత మొత్తం మాఫీ చేశారు. చివరి ఏడాది నాలుగు, ఐదు విడతలు ఇస్తానంటూ... నమ్మించి గొంతుకోశారు. ఇలా ఐదేళ్ల కాలంలో రైతులను రాచి రంపాన పెట్టి రూ.1,550 కోట్ల వరకు మాఫీ చేశారు. నాలుగు, ఐదు విడతల కింద రూ.1,225 కోట్లు చెల్లించలేక మోసపుచ్చారు. మాఫీ చేసిన మొత్తం చాలా మంది రైతులకు వడ్డీకి కూడా చాలకపోవడంతో అష్టకష్టాలు పడి బ్యాంకులకు చెల్లించారు.

ఇన్‌పుట్ ఇవ్వకుండా మోసం..

అస్తవ్యస్త రుణమాఫీ కారణంగా 2014, 2015లో పంట రుణాల రెన్యువల్స్ పూర్తిగా మందగించింది. దీంతో ఆయా సీజన్లలో పంట నష్టానికి రావాల్సిన ఇన్‌పుట్‌సబ్సిడీ, ఇన్సూరెన్స్ నష్టపోయారు. అలాగే 2013 పంట నష్టానికి రూ.643 ఇన్‌పుట్ సబ్సిడీ ఇస్తానని చెప్పిన హామీ నెరవేర్చలేకపోయారు. 2014, 2016లో మంజూరు చేసిన ఇన్‌పుట్‌సబ్సిడీ కింద రూ.100 కోట్లు ఇవ్వకుండా పెండింగ్‌లో పెట్టారు. 2015లో పంట దారుణంగా దెబ్బతిన్నా... రాష్ట్రంలో ఏడు జిల్లాలకు ఇచ్చి 'అనంత'కు మొండిచేయి చూపించారు. అదే ఏడాది వరుస తుఫాన్లకు వేరుశనగ పొలాల్లోనే కుళ్లిపోగా రూ.25 కోట్లు ఇన్‌పుట్ ఇవ్వకుండా మరపించేశారు. రాజకీయ జోక్యంతో ఇన్‌పుట్ జాబితాలు తప్పులతడక కావడంతో 2016లో 1.15 లక్షల మంది రైతుల నుంచి అర్జీలు స్వీకరించి రూ.143 కోట్లు ఇస్తామన్నా... చివరకు చేతులెత్తేశారు. ఇక 2018లో 45 శాతం లోటు వర్షపాతం నమోదు కావడంతో ఖరీఫ్, రబీ పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఖరీఫ్‌లో 63 మండలాలు, రబీలో 32 మండలాలను కరువు జాబితాలోకి ప్రకటించిన చంద్రబాబు ప్రభుత్వం ఖరీఫ్‌లో రూ.967 కోట్లు, రబీలో రూ.100 కోట్లు ఇన్‌పుట్ ఇస్తామని చెప్పినా ఇవ్వకుండా మోసం చేశారు. ఇవి కాకుండా మధ్య మధ్యలో అకాల వర్షాలు, అధిక వర్షాలు, వడగండ్లు, ఈదురుగాలులకు దెబ్బతిన్న పంటలకు కూడా రూ.10 కోట్ల వరకు పరిహారం రావాల్సివుంది. ఇలా... కేవలం ఇన్‌పుట్ సబ్సిడీ కిందనే రూ.2,460 కోట్లకు పైగా పరిహారం దక్కని పరిస్థితి నెలకొంది.

చిల్లరవేసి పండుగ చేసుకోండని హేళన

2017 రబీ, 2018 ఖరీఫ్, రబీ కింద వాతావరణ బీమా, ఫసల్‌బీమా కింద పరిహారం ఇవ్వలేదు. 6 లక్షలకు మందికి పైగా రైతులు తమ వాటా కింద ఏటా రూ.100 కోట్ల ప్రీమియం చెల్లించినా ఫలితం లేదు. మూడు సీజన్ల కింద జరిగిన పంట నష్టం అంచనాలు పరిగణనలోకి తీసుకుంటే పంటల బీమా కింద రూ.1,200 కోట్లకు పైగా కోల్పోయారు. రుణమాఫీ జాప్యం కారణంగా 2014, 2015లో రెన్యువల్స్, ప్రీమియం కట్టని కారణంగా అటు ఇన్‌పుట్‌తో పాటు ఇటు బీమా కింద పరిహారం నష్టపోయారు. అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు కూడా పరిహారం ఇవ్వకుండా ఎగ్గొట్టారు. ఇలా... చెప్పుకుంటూ పోతే చంద్రబాబు హయాంలో అడుగడుగునా రైతులు దగా పడ్డారు. ఇవన్నీ మరిపించే యత్నంగా 2019 ఎన్నికల చివర్లో అన్నదాత సుఖీభవ అంటూ ఒక్కో రైతుకుటుంబం ఖాతాలో కేవలం రూ.1,000 చొప్పున వేసి పండుగు చేసుకోండంటూ హేళన చేసేలా వ్యవహరించడంతో ఎన్నికల ఫలితాల్లో చంద్రబాబుకు దిమ్మదిరిగేలా గట్టిగా గుణపాఠం చెప్పారు.

ఆ బాధలు చెప్పలేం



చంద్రబాబు రైతులను తీవ్ర ఇబ్బందులు పెట్టాడు. వర్షాలు కురవక పంటలు పండక అప్పుడు మేం పడిన బాధలు చెప్పేందుకు వీలుకాదు. విత్తనాలు, ఎరువులు సకాలంలో ఇచ్చేవారు కాదు. చివరకు కరెంటు కూడా సరిగా ఇవ్వకుండా పంటలు ఎండబెట్టాడు. రుణమాఫీ పేరుతో నిలువునా ముంచేశాడు. బాబు హయాం గుర్తొస్తేనే భయమేస్తుంది. ఆయనిప్పుడు ఏం చేసినా రైతులెవరూ నమ్మరు.
– ఈశ్వరరెడ్డి, రైతు, బీడుపల్లి, పుట్టపర్తి మండలం

ఆ రోజులు మరచిపోలేం



చంద్రబాబు హయాంలో మేము పడిన బాధలు అన్నీ ఇన్నీ కావు. ఎరువులు, విత్తనాల కోసం పడరాని పాట్లు పడ్డాం. దుర్భిక్ష పరిస్థితుల్లో ఉన్నా కనికరించలేదు. బ్యాంకుల ద్వారా రుణాలు తెచ్చుకుని గట్టెక్కాం. ఆ రుణాలన్నీ మాఫీ చేస్తామని చెప్పి నట్టేట ముంచాడు. నష్టపరిహారం ఇస్తామని ఎకరాకు రూ.10, రూ.20 చొప్పున ఇచ్చాడు. ఇప్పుడు ఓట్ల కోసం ఆయన ఏం చెప్పినా నమ్మి మోసపోలేం.
– ప్రతాప్‌రెడ్డి, రైతు, ఎం.చెర్లోపల్లి, బత్తలపల్లి మండలం

రెండో విడత ఈవీఎంల ర్యాండమైజేషన్ పూర్తి



మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు, అబ్జర్వర్లు ఇమ్నాలెన్సా, దీపక్ రామచంద్ర తివారీ, అమిత్ కుమార్

- ప్రశాంత ఎన్నికలకు అందరి సహకారం అవసరం
- కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: ఎన్నికల ప్రక్రియలో భాగంగా బుధవారం కలెక్టరేట్‌లో మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల ఈవీఎంల రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అరుణ్‌బాబు, రాప్తాడు, కదిరి, ధర్మవరం అసెంబ్లీ నియోజకవర్గాల పరిశీలకులు దీపక్ రామచంద్ర తివారీ, పోలీస్ అబ్జర్వర్ ఇమ్నాలెన్సా, హిందూపురం పార్లమెంట్ పరిశీలకులు అమిత్ కుమార్, డీఆర్‌ఓ కొండయ్య, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈ ప్రక్రియను పూర్తి చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ఈవీఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహించామన్నారు. జిల్లాలో మొత్తం 1,571 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. మడకశిర నియోజకవర్గంలో 241 పోలింగ్ కేంద్రాలుండగా, 291 చొప్పున సీయూలు, బీయూలు, 348 వీవీ ప్యాట్‌లు సిద్ధంగా ఉంచామన్నారు. హిందూపురం నియోజకవర్గంలో 253 పోలింగ్ కేంద్రాలుండగా, 308 చొప్పున సీయూలు, బీయూలు, 361 వీవీ ప్యాట్‌లు సిద్ధం చేశామన్నారు. పెనుకొండయల 265 పోలింగ్ కేంద్రాలు ఉండగా, 323 చొప్పున సీయూలు, బీయూలు, 376 వీవీ ప్యాట్‌లు సిద్ధం చేశామన్నారు. పుట్టపర్తి నియోజకవర్గంలో 241 పోలింగ్ కేంద్రాలుండగా, 292 చొప్పున సీయూలు, బీయూలు, 342 వీవీ ప్యాట్‌లు ఉన్నాయన్నారు. ధర్మవరం నియోజకవర్గంలో 290 పోలింగ్ కేంద్రాలుండగా, 353 చొప్పున సీయూలు, బీయూలు, 407 వీవీ ప్యాట్‌లు సిద్ధం చేశామన్నారు. కదిరి నియోజకవర్గంలో 281 పోలింగ్ కేంద్రాలుండగా, 342 చొప్పున సీయూలు, బీయూలు, 396 వీవీ ప్యాట్‌లు సిద్ధం చేశామన్నారు.

అభ్యర్థుల ఖర్చు నిబంధన మేరకే ఉండాలి


మాట్లాడుతున్న ఎన్నికల వ్యయ పరిశీలకులు అమిత్‌కుమార్, పాల్గొన్న రాజకీయ పార్టీల నాయకులు

- ఎన్నికల వ్యయ పరిశీలకులు అమిత్‌కుమార్

పుట్టపర్తి అర్బన్: ఎన్నికల కమిషన్ సూచించిన నిబంధనలకు లోబడే అభ్యర్థులు ఖర్చు చేయాలని హిందూపురం పార్లమెంట్ ఎన్నికల వ్యయ పరిశీలకులు అమిత్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఎన్నికల వ్యయంపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్లమెంట్‌కు పోటీ చేస్తున్న అభ్యర్థి రూ.95 లక్షలు, అసెంబ్లీకి పోటీ చేసే అభ్యర్థి రూ.40 లక్షలకు మించి ఖర్చు చేయకూడదన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ కొండయ్య, నోడల్ అధికారులు పాల్గొన్నారు. పోటీ చేస్తున్న అభ్యర్థులంతా ప్రత్యేక ఖాతా తెరవాలని, నామినేషన్ వేసిన తేదీ నుంచి ఫలితాల ప్రకటనల రోజు వరకూ ఆ ఖాతా నుంచే ఖర్చులకు సంబంధించిన నిధులు వాడుకోవాలన్నారు. ఫలితాలు వెలువడిన తర్వత మూడు రోజుల్లోపు ఖర్చుల వివరాలను ఎన్నికల అధికారికి సమార్పించాలన్నారు. లేకపోతే మూడేళ్ల పాటు సదరు అభ్యర్థి ఎన్నికల్లో పోటీ చేసే అర్హత కోల్పోతారన్నారు. అభ్యర్థి రూ.10 వేలకు మించి నగదు రూపంలో ఎటువంటి విరాళం /రుణం కానీ స్వీకరించరాదన్నారు. ఈ నెల 6, 10 తేదీల్లో అభ్యర్థులు ఖర్చు పెట్టే ఖాతాలను పరిశీలిస్తామన్నారు.

మరుగుదొడ్డి స్థలాన్నీ వదల్లేదు!

- తప్పుడు పత్రాలతో రిజిస్ట్రేషన్ చేసుకున్న టీడీపీ నేతలు
- ఆపై బ్యాంకులో తనఖా పెట్టి రుణం తీసుకున్న వైనం
- లోకాయుక్తకు ఫిర్యాదు చేసిన స్థానికుడు


ఫిర్యాదు ప్రతిని చూపుతున్న వై.సువేబ్

హిందూపురం: ఖాళీ స్థలం కనిపిస్తే పాగా వేసే టీడీపీ నేతలు హిందూపురంలో ప్రభుత్వ స్థలాలనూ వదలడం లేదు. చివరకు సామూహిక మరుగుదొడ్ల స్థలాన్నీ కబ్జా చేశారు. దీనిపై స్థానిక వ్యక్తి లోకాయుక్తలో ఫిర్యాదు చేయగా ఈ కబ్జా బాగోతం వెలుగులోకి వచ్చింది.

రికార్డులు తారుమారు చేసి..

హిందూపురంలోని వాల్మీకి సర్కిల్ వద్ద ఉన్న ప్రభుత్వ స్థలంలో చాలా ఏళ్ల క్రితం సామూహిక మరుగుదొడ్డి నిర్మించారు. ఆ తర్వాత కాలంలో ప్రజలంతా వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోగా, సామూహిక మరుగుదొడ్డి నిరుపయోగంగా మారింది. మున్సిపల్ రికార్డుల్లోనూ ఆ స్థలం మరుగుదొడ్ల జాగాగా నమోదై ఉంది. ఆ స్థలంపై కన్నేసిన టీడీపీ నాయకుడు ప్యారూసాబ్ కుమారులు హిదాయత్, ఇందాద్, ఫైజుల్లా కబ్జా చేసేందుకు ప్లాన్ వేశారు. ఇందులో భాగంగా సదరు స్థలానికి తప్పుడు రికార్డులు సృష్టించారు. మున్సిపల్ అధికారుల సహకారంతో రికార్డులు తారుమారు చేశారు. అనంతరం తమ పేరు మీద రిజిస్ట్రేషన్ సైతం చేసుకున్నారు. ఆపై బ్యాంకులో తనఖా పెట్టి రుణం కూడా పొందారు. దీనిపై స్థానికుడు వై.సువేబ్ ఏపీ లోకాయుక్తలో మార్చి 30వ తేదీన పిటిషన్ దాఖలు చేశారు. పిటీషన్ పరిశీలించిన లోకాయుక్త విచారణకు స్వీకరించింది. ప్రభుత్వ స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసిన హిందూపురం, చిలమత్తూరు సబ్ రిజిస్ట్రార్లు, రుణం మంజూరు చేసిన ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు అధికారులు, ప్రభుత్వ స్థలాన్ని కాపాడేందుకు ప్రయత్నించని మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్‌లపై తాను అభియోగం మోపుతూ ఫిర్యాదు చేశానని వై.సువేబ్ తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసిన లోకాయుక్త జూలై 8వ తేదీన విచారణ జరపనున్నట్లు తనకు సమాచారం పంపించిందని ఆయన బుధవారం 'సాక్షి'కి తెలిపారు.

'పురం'లో కుమ్మక్కు రాజకీయం!

- టీడీపీతో జత కట్టిన కాంగ్రెస్
- వైఎస్సార్‌సీపీ ఓట్లు చీల్చడమే లక్ష్యంగా ప్రణాళిక

హిందూపురం టౌన్: హిందూపురం నియోజకవర్గంలో టీడీపీ, కాంగ్రెస్ కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నాయి. వైఎస్సార్ సీపీని టార్గెట్ చేసి కుట్ర రాజకీయాలకు తెర లేపాయి. తాము ఎటూ గెలవలేం, వైఎస్సార్ సీపీని నియంత్రించడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ అడుగులు వేస్తోంది. అందివచ్చిన అవకాశాన్ని టీడీపీ సద్వినియోగం చేసుకుంటోంది.

మైనార్టీలంతా వైఎస్సార్ సీపీ వెంటే..

వైఎస్సార్ కల్పించిన నాలుగు శాతం రిజర్వేషన్, ఆ తర్వాత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలతో ముస్లిం మైనార్టీలంతా పార్టీలకు అతీతంగా వైఎస్సార్ సీపీకి మద్దతు తెలుపుతున్నారు. గడచిన పలు ఎన్నికల్లో ఇది స్పష్టమైంది. ఈ ఎన్నికల్లో బీజేపీ, జనసేన, టీడీపీ పొత్తు కారణంగా ముస్లిం మైనార్టీలంతా ఏకపక్షంగా వైఎస్సార్ సీపీకే మద్దతు తెలుపుతున్నారు. దీంతో హిందూపురంలో బాలకృష్ణ ఓటమి ఖాయంగా టీడీపీ సర్వేలో తేలింది. ఈ నేథ్యంలోనే టీడీపీ ముస్లిం మైనార్టీల ఓట్లను వైఎస్సార్ సీపీకి పడకుండా కుట్ర చేసింది. ఇందుకోసం కాంగ్రెస్‌తో చేతులు కలిపి ఆ పార్టీ తరపున మైనార్టీని అభ్యర్థిని ఉంచి వైఎస్సార్ సీపీ ఓట్లు చీల్చేందుకు ప్లాన్ చేసింది.

చివరి నిమిషంలో అభ్యర్థిని మార్చిన కాంగ్రెస్..

హిందూపురంలో మైనార్టీ ఓటర్లు అత్యధికంగా ఉన్నారు. వీరంతా వైఎస్సార్ సీపీకి మద్దతు తెలుపుతున్నారు. దీంతో వీరి ఓట్లను దారిమళ్లించేందుకు టీడీపీ ప్లాన్ వేసింది. ఇందుకోసం కాంగ్రెస్ సాయాన్ని కోరింది. దీంతో కాంగ్రెస్ తొలుత వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన నాగరాజుకు టికెట్ ప్రకటించింది. అయితే ఆ తర్వాత టీడీపీ ఒత్తిడికి తలొగ్గి తెరపైకి ఇనయతుల్లాను తీసుకువచ్చింది. ఎంహెచ్ ఇనయతుల్లా 2014 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసి ఓడిపోయారు. అప్పటి నుంచి ఆయన పార్టీకి దూరంగానే ఉన్నారు. కానీ ఉన్నట్టుండి ఎంహెచ్ ఇనయతుల్లాకు కాంగ్రెస్ బీఫాం ఇచ్చింది. ఈ నిర్ణయాన్ని కాంగ్రెస్ నాయకులే తప్పుపడుతున్నారు. టీడీపీ ఒత్తిడికి తలొగ్గి అభ్యర్థిని మార్చడం బాగోలేదంటున్నారు. టీడీపీకి మేలు చేసే క్రమంలో పార్టీకి ద్రోహం చేస్తున్నారని మండిపడుతున్నారు.

సత్యకుమార్.. యాదవ్ కాదు


మాట్లాడుతున్న హరీష్ కుమార్ యాదవ్

- రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్ కుమార్ యాదవ్

ముదిగుబ్బ: ధర్మవరంలో బీజేపీ తరఫున పోటీ చేస్తున్న సత్యకుమార్ తాను యాదవ కులానికి చెందిన వ్యక్తినంటూ యాదవ కులస్తులను మోసం చేస్తున్నారని యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్ కుమార్ యాదవ్ అన్నారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. సత్యకుమార్ మహారాష్ట్రకు చెందిన ఆర్య క్షత్రియుడని, అతని ఇంటి పేరు యాదవ్ అని ఉండటం వల్ల అందరూ యాదవ్ అనుకుంటున్నారని, దీన్ని అవకాశంగా తీసుకుని అతను కూడా తాను యాదవుడనని, బీసీ వర్గానికి చెందిన వడినని చెప్పుకుంటున్నారన్నారు. ప్రచారంలోనూ తాను యాదవ కులస్తుడినని ప్రజలను, బీసీలను, యాదవ కులస్తులను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో యాదవుల జనాభా ఎంత ఉందో అన్న విషయమైనా సత్యకుమార్‌కు తెలుసా.. అని ప్రశ్నించారు. ''ఈ ప్రాంతానికి చెందిన వ్యక్తికాదు...ఈ జిల్లా పరిస్థితులు తెలియవు.. ఎన్నికల తర్వాత ఎక్కడుంటాడో తెలియదు.. అలాంటి వ్యక్తిని నమ్మవద్దు'' అని ప్రజలను కోరారు. ప్రెస్‌మీట్లు పెట్టి, ర్యాలీలు చేసుకుంటూ హడావుడి చేస్తున్న సత్యకుమార్‌కు ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. నిత్యం ప్రజల్లో ఉంటూ అందరి సంక్షేమానికి పాటుపడుతున్న కేతిరెడ్డి వెంకటరామిరెడ్డికి మద్దతుగా నిలవాలని కోరారు. ఇక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 58 నెలల కాలంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీల సంక్షేమానికి ఎన్నో చర్యలు చేపట్టారని, పాలనలో భాగస్వాములను చేశారన్నారు. గతంలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారని, అందుకే మళ్లీ ధైర్యంగా చేయగలిగిన వాటినే మేనిఫెస్టోలో పొందుపరిచారన్నారు. జగన్ చెప్పాడంటే తప్పక చేస్తాడని ప్రజలంతా నమ్ముతున్నారన్నారు. ప్రజల ఆశీర్వాదంతో మళ్లీ జగనన్న సీఎం కావడం తథ్యమన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఇందుకూరి నారాయణరెడ్డి, ఐటీ వింగ్ జోనల్ ఇన్‌చార్జ్ మంజునాథ్ యాదవ్, వైఎస్సార్ సీపీ నాయకులు మల్లాగుండ్ల భాస్కర్, వెంకటేశ్వర్‌రెడ్డి, కుళ్లాయప్ప, లోకేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

డీఎడ్ 4వ సెమిస్టర్ పరీక్ష ఫీజు చెల్లించండి

పుట్టపర్తి: జూన్‌లో జరిగే డీఎడ్ 4వ సెమిస్టర్ పరీక్షలకు సంబంధించి రెగ్యులర్, ప్రైవేట్ విద్యార్థులు ఈ నెల 8, 9వ తేదీల్లోపు ఫీజు చెల్లించాలని బుక్కపట్నం డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రవిసాగర్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 15,16వ తేదీలలో అపరాధ రుసుంతో ఫీజు చెల్లించవచ్చునన్నారు.

పొలంలో మృత శిశువు



మృతశిశువును పరిశీలిస్తున్న అధికారులు

రొద్దం: పుట్టిన గంటల వ్యవధిలోనే మగశిశువును పొలాల్లో పడేశారు. స్థానికులు గుర్తించేలోపు ఆ శిశువు మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. రొద్దం మండలం పెద్దగువ్వలపల్లి గ్రామ సమీపంలో బుధవారం ఉదయం ఓ గుర్తు తెలియని వ్యక్తి నవజాత శిశువును తీసుకువచ్చి పొల్లాలో వదిలి వెళ్లిపోయాడు. శిశువుపై ఎండ పడకుండా ఉండేందుకు టెంకాయ పట్టాతో పాటు ప్లాస్టిక్ సంచిని కట్టి ఉంచాడు. ఆలస్యంగా అటుగా వెళ్లిన వారు గుర్తించేలోపు ఆ శిశువు మృతి చెందాడు. సమాచారం అందుకున్న వైద్య శాఖ, ఐసీడీఎస్ అధికారులు, పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. అనంతరం శిశువు మృతదేహాన్ని ఖననం చేశారు. ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

చెట్టును ఢీ కొన్న కారు



చెన్నేకొత్తపల్లి: చెట్టును కారు ఢీకొన్న ఘటనలో నలుగురు గాయపడ్డారు. వివరాలు... ధర్మవరంలోని గిర్రాజు కాలనీకి చెందిన షడ్రిక్, పూర్ణేష్, చేతన్‌కుమార్, అరవింద్... బుధవారం ఉదయం కారులో ఎస్‌ఎస్ గేట్ వైపుగా బయలుదేరారు. ప్యాదిండి సమీపంలోకి చేరుకోగానే డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో కారు వేగంగా వెళ్లి రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీకొంది. ఘటనలో కారులో ప్రయాణిస్తున్న నలుగురూ తీవ్రంగా గాయపడ్డారు. కారు ముందు భాగం నుజ్జునుజ్జయింది. క్షతగాత్రులను స్థానికులు వెంటనే 108 అంబులెన్స్ ద్వారా ధర్మవరంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం అనంతపురానికి రెఫర్ చేశారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

చంద్రబాబు పచ్చి మోసకారి



బహిరంగ సభకు హాజరైన ప్రజలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధరరెడ్డి, చిత్రంలో ఎంపీ అభ్యర్థి బోయ శాంతమ్మ

- బాబు, కరువు కవలలు
- బాబొస్తే వానలు రావు..
- 2025లోపు 193 చెరువులను నీటితో నింపుతాం
- అమడగూరు బహిరంగ సభలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధరరెడ్డి

అమడగూరు: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ఓ పచ్చి మోసకారి అని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధరరెడ్డి ధ్వజమెత్తారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం అమడగూరులోని చౌడేశ్వరి కల్యాణమంటపం వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో హిందూపురం ఎంపీ అభ్యర్థి బోయ శాంతమ్మతో కలసి ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రతిపక్ష నాయకుల ఆరోపణలపై మండిపడ్డారు. చంద్రబాబు, కరువు కవలపిల్లలు అనడానికి ఆయన పాలనే సాక్ష్యమన్నారు. చంద్రబాబు అధికారంలో ఉన్నన్ని రోజులూ రాష్ట్రంలో వానలు లేక భూస్వాములు సైతం వలసలు వెళ్లారని గుర్తు చేశారు. 2019 తర్వాత వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం వైఎస్ జగనన్న పాలనలో సకాలంలో వర్షాలు కురిసాయన్నారు. నియోజకవర్గంలోని 193 చెరువులకు నీటిని నింపడానికి జీఓ నంబరు 36 జారీ చేసి, కృష్ణా జలాల నుంచి 3 టీఎంసీల నీటిని కేటాయించి రూ.364 కోట్లు నిధులను సీఎం జగనన్న మంజూరు చేశారన్నారు. అమడగూరుకు దాదాపు 40 గ్రామాలను అనుసంధానం చేస్తూ తారురోడ్లను వేశామన్నారు. జగనన్న ఇళ్ల కింద 3 వేల పక్కా గృహాలను మంజూరు చేశామని, మరోసారి వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే మరో 3 వేల ఇంటి పట్టాలను మంజూరు చేసి పక్కా గృహ నిర్మాణాలు చేపడతామన్నారు. అలాగే అమడగూరు మండలం మీదుగా జాతీయ రహదారిని ఏర్పాటు చేసి, ఈ ప్రాంతాన్ని పారిశ్రామిక హబ్‌గా మార్చి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగు పరుస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓబీసీ, కాపులకు మంచి జరిగేలా ఈ ఎన్నికల మేనిఫెస్టోను జగనన్న రూపొందించారన్నారు. మన ప్రాంతం నుంచి పెద్ద ఎత్తున ప్రతి గ్రామంలోనూ ఇంజనీర్లు తయారయ్యారంటే దానికి కారణం వైఎస్ రాజశేఖరరెడ్డి అమలు చేసిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌నని గుర్తు చేశారు. అధికారంలో ఉన్నన్ని రోజులూ నియోజకవర్గ అభివృద్ధిని ఏ మాత్రం పట్టించుకోని పల్లె రఘునాథరెడ్డి మరోసారి ప్రజలను మభ్య పెట్టేందుకు వస్తున్నారని, ఆయనను నిలదీసి వెనక్కు పంపాలని పిలుపునిచ్చారు. ఆయన ఓటమి ఖాయమని తెలుసుకున్న చంద్రబాబు సైతం టికెట్ నిరాకరిస్తే కోడలిని ముందుకు పెట్టి తెర వెనుక నుంచి నాటకం ఆడిస్తున్నాడని మండిపడ్డారు. చంద్రబాబు, పల్లె ఇద్దరూ వట్టి సన్యాసులని వీరికి ఓటుతోనే బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు నాగరాజురెడ్డి, బత్తల వెంకటరమణ, ఎంపీపీ ప్రసాదరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సూర్యనారాయణరెడ్డి, జెడ్పీటీసీ కవితా శివశంకరరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ జయప్ప, రాష్ట్ర హౌసింగ్ డైరెక్టర్ శేషూరెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, మాజీ జెడ్పీటీసీలు పొట్టా పురుషోత్తమరెడ్డి, ఉమాదేవి, మాజీ ఎంపీపీ నరేంద్రరెడ్డి, డీఎస్పీ వేణుగోపాల్, సొసైటీ అధ్యక్షులు సూర్యనారాయణరెడ్డి, బొట్టుస్వామి, సర్పంచ్ షబ్బీర్, ఎంపీటీసీ పెద్దప్పయ్య, తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే సామాజిక న్యాయం

- గిరిజనులందరూ ఏకం కావాలి..
- గిరిజన ప్రజా సమాఖ్య అధ్యక్షుడు మల్లికార్జున నాయక్



పెనుకొండ: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సామాజిక న్యాయం సిద్ధించిందని, ఈ నేపథ్యంలో గిరిజనులందరూ ఏకమై జగనన్నను మళ్లీ సీఎంగా చేసుకుందామని గిరిజన ప్రజా సమాఖ్య జాతీయ అధ్యక్షుడు జి.మల్లికార్జుననాయక్ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేసారు. ఈ ఐదేళ్ల పాలనలో మహాత్మ జ్యోతిబా పూలే, గాంధీజీ, అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా పాలన సాగించి గ్రామ స్వరాజ్యాన్ని సిద్ధింప చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దన్నారు. సామాజిక పింఛన్లను ఇంటి వద్దకే అందించిన గొప్ప మానవతావాది వైఎస్ జగన్‌కు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని పిలుపునిచ్చారు. గత ప్రభుత్వ పాలనలో గిరిజన సంక్షేమానికి రూ.5 వేల కోట్లు ఖర్చు చేస్తే... వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఏకంగా రూ.19 వేల కోట్లను సీఎం వైఎస్ జగన్ వెచ్చించారని గుర్తు చేశారు. అలాగే ఏజెన్సీ ప్రాంతాల్లో రెండు మెడికల్ కళాశాలలు, ఐదు ఐటీడీఏ ప్రాంతాల్లో మల్టీసూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు, కురుపాంలో గిరిజన విశ్వవిద్యాలయం, ఏజెన్సీ ప్రాంతంలో 497 సచివాలయాల ద్వారా స్థానిక గిరిజనులకే ఉద్యోగ అవకాశాలు కల్పించారన్నారు. గిరిజన కుటుంబాలకు 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్‌ను అందించారన్నారు. 1.54 లక్షల గిరిజన కుటుంబాలకు 3,22 లక్షల ఎకరాల భూమిని పంపిణీ చేసారన్నారు. ప్రజలకు మంచి చేసిన వైఎస్ జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

బాబు మేనిఫెస్టో బూటకం

- ప్రజలను వంచించేందుకే సూపర్ సిక్స్ హామీలు
- నయవంచకురాలు సవితమ్మ
- 16 కేసుల్లో ఆమె నిందితురాలు
- పెనుకొండ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేవీ ఉషశ్రీచరణ్



మాట్లాడుతున్న కేవీ ఉషశ్రీచరణ్

గోరంట్ల: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు ప్రకటించిన మేనిఫెస్టో ఓ బూటకమని రాష్ట్ర మహిళాశిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ విమర్శించారు. ఎలాగైనా అధికారాన్ని దక్కించుకోవాలన్న తపనతో ప్రజలను మరోసారి దగా చేసేలా సూపర్ సిక్స్ హామీలతో ముందుకు వస్తున్నారని మండిపడ్డారు. 2014 ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కదానిని అధికారంలోకి వచ్చిన తర్వాత నెరవేర్చకుండా రాష్ట్ర ప్రజలను వంచించిన చంద్రబాబుకు ఈ ఎన్నికల్లో గట్టిగా బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం గోరంట్లలో పర్యటించిన ఆమె స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఒకే దేశం.. ఒకే మేనిఫెస్టో నినాదంతో ఎన్నికల బరిలో దిగిన కేంద్రంలోని బీజేపీతో పొత్తు పెట్టుకున్న చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ ఇందుకు విరుద్ధంగా ఏపీకి ప్రత్యేక మేనిఫెస్టోను విడుదల చేయడం చూస్తుంటే అంతా బూటకమని స్పష్టమవుతోందన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీని ఓ పావులా చంద్రబాబు వాడుకుంటున్నారన్నారు. టీడీపీ మేనిఫెస్టోలో చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ ఫొటోలు తప్ప బీజేపీ పెద్దల ఫొటోలు లేకపోవడమే ఇందుకు నిదర్శనమన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పడ్డాయన్నారు. ఏదైతే చేయగలుగుతారో దానిని మాత్రమే మేనిఫెస్టోలో చేర్చి పవిత్ర గ్రంథాలుగా భావిస్తూ అధికారం చేపట్టిన తర్వాత అందులోని ప్రతి పథకాన్ని తూచ తప్పకుండా అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దన్నారు. పెనుకొండ నియోజకవర్గంలో 2.20లక్షల మందికి రూ.2.18 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. గ్రావెల్ చోరీ, 420, ఫోర్జరీ, చీటింగ్ తదితర 16 కేసుల్లో నిందితురాలిగా ఉన్న నయవంచకురాలు సవితమ్మను నమ్మరాదని పిలుపునిచ్చారు. కన్నతల్లిపైనే కేసులు పెట్టి వేధించిన వారు రేపు గెలిచిన తర్వాత ఈ ప్రాంత ప్రజలను వేధింపులకు గురి చేయరనే దానికి గ్యారెంటీ ఏమిటని ప్రశ్నించారు. మంచి చేసిన నాయకుడికి మద్దతు ఇవ్వాలని, ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించడం ద్వారా మరోసారి వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రి చేద్దామంటూ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, జెడ్పీటీసీ సభ్యుడు పాలే జయరాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

మడకశిరలో దారిదోపిడీ

మడకశిర: స్థానిక ప్రభుత్వ వెటర్నరీ కళాశాల వద్ద బుధవారం ఉదయం ద్విచక్ర వాహనంపై వెళుతున్న ప్రముఖ కాంట్రాక్టర్ లక్ష్మీనరసప్పను దుండగులు అడ్డుకుని రెండు బంగారు ఉంగరాలను దోచుకున్నారు. బుధవారం ఉదయం 10 గంటల సమయంలో తన స్వగ్రామం గుడ్డం పల్లి నుంచి మడకశిరకు ద్విచక్ర వాహనంపై వస్తుండగా వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల వద్ద మరో ద్విచక్ర వాహనంపై ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు అడ్డుకున్నారు. చేతి వేళ్లకు ఉన్న రెండు ఉంగరాలను తీసి ఇవ్వాలని, లేకుంటే హతమారుస్తామంటూ భయపెట్టి, ఉంగరాలను లాక్కొని ఉడాయించారు. వీటి విలువ దాదాపు రూ.2.10 లక్షల వరకు ఉంటుంది. ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

మార్కెట్ కమిటీల్లోనూ సామాజిక న్యాయం

అనంతపురం అగ్రికల్చర్: నా ఎస్సీ... నా ఎస్టీ... నా బీసీ... నా మైనార్టీ... అంటూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అన్ని వర్గాలనూ అక్కున చేర్చుకుంటూ సుపరిపాలన సాగిస్తున్నారు. దేశంలో మరెక్కడా లేని విధంగా నామినేటెడ్ పదవుల నియామకాల్లో సామాజిక న్యాయాన్ని పాటించారు. ప్రధానంగా రైతులకు సేవలు మరింత విస్తృతం చేయాలనే ఆలోచనతో నియోజక వర్గానికి ఒక మార్కెట్‌యార్డు తప్పనిసరిగా చేస్తూ పునర్వ్యవస్థీకరణతో మార్కెట్ యార్డుల సంఖ్యను పెంచారు. పాలక వర్గ చైర్మన్, డైరెక్టర్ల నియామకాల్లో పలువురు ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ, మహిళలకు సముచిత స్థానం కల్పించారు. స్థానిక ఎమ్మెల్యేల ప్రాధాన్యతను పెంచుతూ ఆయా కమిటీలకు గౌరవాధ్యక్షులుగా ప్రకటించారు.

17కు చేరిన మార్కెట్ కమిటీలు, అందులో 9 మహిళలకే

ఉమ్మడి జిల్లా పరిధిలో గతంలో 13 వ్యవసాయ మార్కెట్‌యార్డులు ఉండగా వాటిని 17కు పెంచారు. నియోజక వర్గానికి ఒకటి తప్పనిసరి చేయడంతో కొత్తగా రాప్తాడు, శింగనమల, పుట్టపర్తి నియోజక వర్గాలతో పాటు గోరంట్లను కూడా చేర్చడంతో మార్కెట్‌యార్డుల సంఖ్య 17కు చేరాయి. ఇందులో గుంతకల్లు, కదిరి, పెనుకొండ నియోజక వర్గాల్లో రెండేసి చొప్పున ఉన్నాయి. జిల్లా యూనిట్‌గా తీసుకుని చైర్మన్, డైరెక్టర్ల ఎంపికలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు 50 శాతం, అలాగే మహిళలకు 50 శాతం మేర కోటా తప్పనిసరి చేయడంతో 17 కమిటీల్లో 9 యార్డుల చైర్మన్ పోస్టులు మహిళామణులకే దక్కాయి. ఈ లెక్కన తనకల్లు, గోరంట్ల (ఎస్సీ-మహిళ), కళ్యాణదుర్గం, మడకశిర, ఉరవకొండ (బీసీ-మహిళ), ధర్మవరం, పెనుకొండ, రాయదుర్గం, పుట్టపర్తి (ఓసీ-మహిళ) కేటాయించారు. అనంతపురం (మైనార్టీ జనరల్), హిందూపురం, కదిరి (బీసీ), గుత్తి (ఎస్సీ జనరల్), గుంతకల్లు (ఓసీ జనరల్), శింగనమల (ఎస్టీ జనరల్), తాడిపత్రి, రాప్తాడు (ఓసీ జనరల్)కు కేటాయించారు.

డిగ్రీ పట్టా ఆకాంక్ష నెరవేరేలా..

- త్వరలో మెగా సప్లిమెంటరీ పరీక్షలు
- వార్షిక, సెమిస్టర్ విధానంలో నిర్వహణ
- వారం రోజుల్లో నోటిఫికేషన్లు



ఎస్కేయూ ప్రధాన ద్వారం

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో మెగా సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించారు. గతంలో అనివార్య కారణాలతో డిగ్రీ పూర్తి చేయలేని వారు, బ్యాక్‌లాగ్స్ (ఫెయిల్ అయిన వారు) ఉన్నవారికి ఊరట కలిగించే నిర్ణయం తీసుకున్నారు. డిగ్రీ ఫెయిల్ అయి పట్టా పొందలేని పరిస్థితుల్లో పరీక్షలు రాసి ఉత్తీర్ణులయ్యే సదవకాశాన్ని కల్పిస్తున్నారు. 1994–95 విద్యా సంవత్సరం నుంచి 2020 విద్యా సంవత్సరం వరకు ఈ అవకాశం దక్కనుంది. ఎన్ని సబ్జెక్టులు ఫెయిల్ అయి ఉన్నా.. వాటన్నింటినీ రాయడానికి వీలు కల్పించారు.

కమిటీ నిర్ణయం మేరకే..

డిగ్రీ సబ్జెక్టులు ఫెయిల్ అయి పట్టా దక్కని పరిస్థితుల్లో ఉపాధి అవకాశాలు కోల్పోతున్నామని, ఒక అవకాశం కల్పించాలని పలు దఫాలుగా విద్యార్థులు ఉన్నతాధికారులను విన్నవించారు. ఈ క్రమంలో సాధ్యాసాధ్యాలు, విధి విధానాలను నిర్ణయించేందుకు సీడీసీ డీన్ ప్రొఫెసర్ కే. రాంగోపాల్, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ, ఉరవకొండ, కళ్యాణదుర్గం ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లతో కమిటీని ఎస్కేయూ వీసీ ప్రొఫెసర్ కే. హుస్సేన్ రెడ్డి నియమించారు. 1994 నుంచి 2020 వరకు డిగ్రీలో ఫెయిల్ అయిన విద్యార్థులకు మెగా సప్లిమెంటరీ అవకాశం కల్పించాలని ఇటీవల కమిటీ సిఫార్సు చేయగా.. ఎస్కేయూ వీసీ ఆమోదం తెలిపారు. నోటిఫికేషన్‌కు, పరీక్ష రాయడానికి తగిన సమయం ఇవ్వాలని, తొలుత ఇయర్లీ వైజ్ (వార్షిక పరీక్షలు), అనంతరం సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలని కమిటీ సూచించగా వీసీ అందుకు సమ్మతించారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్లు మరో వారం రోజుల్లో ఇవ్వనున్నారు.

ఆ విద్యార్థులకూ అవకాశం..

2008 వరకూ అనంతపురం, కర్నూలు జిల్లా విద్యార్థులు శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలోనే డిగ్రీ అభ్యసించారు. రెండు జిల్లాల్లోని డిగ్రీ కళాశాలలు ఎస్కేయూ పరిధిలోనే ఉండేవి. అయితే, 2008లో కర్నూలు పీజీ కళాశాల రాయలసీమ యూనివర్సిటీగా ఆవిర్భవించడంతో ఆ జిల్లాలోని డిగ్రీ కళాశాలలు సదరు వర్సిటీ పర్యవేక్షణలోకి వెళ్లిపోయాయి. అయితే, తాజాగా ఎస్కేయూ ఉన్నతాధికారులు 1994 విద్యా సంవత్సరం నుంచి డిగ్రీ విద్యార్థులకు అవకాశం కల్పించాలని నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో 2008 వరకూ చదివిన కర్నూలు జిల్లా డిగ్రీ విద్యార్థులకు ఇక్కడే పరీక్షలు రాసే వీలు కల్పించారు.

వేల మందికి ఊరట..

1994–95 విద్యా సంవత్సరం నుంచి 2014–15 వరకు ఇయర్లీ బేస్డ్ (వార్షిక పరీక్షలు) విధానంలో పరీక్షలు జరిగాయి. 2015–16 నుంచి డిగ్రీలో సెమిస్టర్ విధానం అమల్లోకి తెచ్చారు. అప్పట్లో ఉన్న ఫలంగా సెమిస్టర్ విధానం తీసుకురావడంతో వేల మంది విద్యార్థులు సబ్జెక్టులు పూర్తి చేయలేక బ్యాక్‌లాగ్స్ పడ్డాయి. సెమిస్టర్ విధానానికి తగినంత సంసిద్ధత చేయకుండానే విద్యార్థులపై బలవంతంగా రుద్దారు. ఈ నేపథ్యంలో సెమిస్టర్ విధానంలో ఇబ్బడిముబ్బడిగా ఫెయిల్ అయ్యారు. ఈ క్రమంలోనే తమకు అవకాశం కల్పించాలని చాలామంది సెమిస్టర్ విధానంలో ఫెయిల్ అయిన విద్యార్థులు పలు సార్లు విన్నవించారు. దీంతోనే మెగా సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది.

వారం రోజుల్లో నోటిఫికేషన్లు



1994 –95 బ్యాచ్ నుంచి 2020 వరకు డిగ్రీలో ఫెయిల్ అయిన విద్యార్థులకు ఆఖరు అవకాశం (లాస్ట్ ఛాన్స్) కల్పిస్తున్నాం. విద్యార్థుల డిమాండ్ మేరకు ఈ నిర్ణయం తీసుకున్నాం. 2008 వరకు ఉమ్మడి వర్సిటీ పరిధిలోని విద్యార్థులూ పరీక్షలు రాయవచ్చు. వారం రోజుల్లో నోటిఫికేషన్లు జారీ చేయాలని ఆదేశాలు జారీ చేశాం.

– ప్రొఫెసర్ కే. హుస్సేన్ రెడ్డి, వీసీ, ఎస్కేయూ

యువకుడి దుర్మరణం

గుత్తి: స్థానిక పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద బుధవారం ఉదయం చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. మృతుడిని కురువ శివయ్య (27)గా పోలీసులు గుర్తించారు. బళ్లారికి చెందిన శివయ్య మతి స్థిమితం కోల్పోయి కొంత కాలం క్రితం గుత్తికి చేరుకున్నాడు. ఈ క్రమంలో బుధవారం ఉదయం రోడ్డు దాటుతుండగా లారీ దూసుకెళ్లింది. ఘటనలో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.



మృతుడు శివయ్య

గోవుకు హెర్నియా ఆపరేషన్



శస్త్రచికిత్స చేస్తున్న డాక్టర్ పద్మనాభం, కిరణ్‌కుమార్‌రెడ్డి, సునీత తదితరులు

అనంతపురం అగ్రికల్చర్/శింగనమల: జిల్లా పశువైద్యాధికారులు అరుదైన శస్త్రచికిత్సతో ఓ గోవు ప్రాణాలు కాపాడారు. వివరాలు... శింగనమల మండలం చక్రాయపేట గ్రామానికి చెందిన రైతు రామచంద్రారెడ్డి పాడి ఆవు వారం రోజులుగా అనారోగ్యంతో ఇబ్బంది పడుతుండడంతో సలకంచెరువు పశువైద్యశాల డాక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డికి చూపించారు. సమస్య తీవ్రతను గుర్తించిన ఆయన విషయాన్ని వెంటనే శింగనమల పశువైద్యాధికారి (ఏడీ) డాక్టర్ పద్మనాభం దృష్టికి తీసుకెళ్లారు. హెర్నియా సమస్య ఉన్నందున 1962 అంబులెన్స్ ద్వారా అనంతపురం పశువైద్యశాలకు ఆవును తీసుకువచ్చి డాక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, 1962 డాక్టర్ సునీత సహకారంతో డాక్టర్ పద్మనాభం శస్త్రచికిత్స చేపట్టారు. ఉదరపు కండ తెగడం వల్ల చర్మం కిందకు జారిన పేగులు, మూత్రాశయం, గర్భాశయాన్ని తిరిగి యథాస్థానానికి చేర్చి కుట్లు వేశారు. అనంతరం మందులు ఇచ్చి, 1962 అంబులెన్స్‌లోనే రైతు ఇంటి వద్దకు ఆవును వదిలి వచ్చారు. ఆపరేషన్ చేసి పాడి పశువు ప్రాణాలు కాపాడిన వైద్య బృందానికి రైతు రామచంద్రారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

చిలమత్తూరు: మండలంలోని నల్లరాళ్లపల్లి గ్రామానికి చెందిన నాగరాజు శరీరంపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. ఎస్‌ఐ గంగాధర్ తెలిపిన మేరకు... బుధవారం ఉదయం ఇంట్లో తన భార్యతో గొడవ పడిన నాగరాజు పెట్రోల్ పోసుకుని, నిప్పంటించుకున్నాడు. గమనించిన స్థానికులు వెంటనే మంటలు ఆర్పి క్షతగాత్రుడిని హిందూపురంలోని జిల్లాస్పత్రికి తరలించారు. బాధితుడి స్టేట్‌మెంట్ ఆధారంగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపడతామని ఎస్‌ఐ గంగాధర్ తెలిపారు.

నగదు సీజ్



నగదును చూపుతున్న పోలీసులు

ధర్మవరం అర్బన్: ఎలాంటి బిల్లులు లేకుండా తరలిస్తున్న నగదును పోలీసులు సీజ్ చేశారు. వివరాలు... ధర్మవరంలోని ఎర్రగుంట వై జంక్షన్ వద్ద బుధవారం ఉదయం వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటుగా వచ్చిన బొలెరో పికప్ వాహనాన్ని ఆపి తనిఖీ చేయడంతో అందులో ప్రయాణిస్తున్న అనంతపురం జిల్లా పెద్దపప్పూరు మండలం కుమ్మెత గ్రామానికి చెందిన గుంతల పుల్లయ్య, నరసాపురం గ్రామానికి చెందిన శింగనమల రమేష్ వద్ద రూ.1,40,150 నగదును గుర్తించారు. వీటికి ఎలాంటి ఆధారాలను వారు చూపకపోడంతో పోలీసులు సీజ్ చేసి, ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అప్పగించారు. కాగా, చీనీ కాయల వ్యాపారం చేసే తాము మార్కెట్‌లో కాయలు విక్రయించగా వచ్చిన సొమ్ముతో స్వగ్రామానికి వెళుతున్నట్లు పుల్లయ్య, రమేష్ వెల్లడించారు.

వాహనం ఢీకొని మహిళ మృతి

గార్లదిన్నె: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ మహిళ మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు... గార్లదిన్నె మండలం ముంటిమడుగు గ్రామానికి చెందిన అంజినమ్మ (53) బుధవారం ఉదయం ఉపాధి పనులకు వెళుతుండగా గ్రామ శివారులో వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన వాహనం ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆమెను కుటుంబసభ్యులు వెంటనే పామిడిలోని సీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక ఆమె మృతి చెందింది. ఆమెకు భర్త ఓబులేసు, ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ట్యాంకర్ బోల్తా పడి యువకుడు..

గార్లదిన్నె: నీళ్ల ట్యాంకర్ బోల్తాపడిన ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... గార్లదిన్నె మండలం ముకుందాపురం గ్రామానికి చెందిన రాముడు, ఆయన కుమారుడు సోమశేఖర్ (23) బుధవారం ఉదయం చీనీ చెట్లకు నీరందించేందుకు కేశవాపురం నుంచి ట్యాంకర్‌లో నీళ్లు బయలుదేరారు. కమలాపురం సమీపంలోకి చేరుకోగానే ట్యాంకర్ బోల్తాపడింది. ఘటనలో తండ్రీకొడుకులిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే క్షతగాత్రులను ఆటోలో గార్లదిన్నెకు తరలించి అక్కడి నుంచి 108 అంబులెన్స్ ద్వారా అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉన్న సోమశేఖర్ ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

చిరుతల సంచారంతో బెంబేలు

కుందుర్పి: అనంతపురం జిల్లా కుందుర్పి మండలం బెస్తరపల్లి, కెంచంపల్లి పరిసర ప్రాంతాల్లో రెండు చిరుతలు సంచరిస్తున్నాయి. విషయం గుర్తించిన స్థానికులు బెంబేలెత్తుతున్నారు. బొంగానుజావ, చెన్నమాళమ్మ కుంట, కల్లుగుడి ప్రాంతాల్లో చిరుతలు సంచరిస్తున్నట్లుగా ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. తరచూ జీవాలపై దాడులు చేస్తున్నాయని రైతులు తెలిపారు. చీకటిపడితే చాలు రోడ్లపైకి, గ్రామాల్లో చొరబడుతున్నాయన్నారు. ఇటీవల కెంచంపల్లికి చెందిన కిష్టప్ప, బెస్తరపల్లికి చెందిన రామప్ప అనే రైతులకు చెందిన రెండు పశువులను చిరుతలు చంపినట్లు తెలిపారు.

క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే రోడ్ షో

నల్లమాడ: చారుపల్లి పంచాయతీలోని సీ.రెడ్డి వారిపల్లి నుంచి చారుపల్లి, సీ.బడవాండ్లపల్లి, కాలనీ మీదుగా పోలంవాండ్లపల్లి వరకు గురువారం మధ్యాహ్నం 3:30 గంటలకు ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి రోడ్ షో నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు తెలిపాయి. వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొనాలని కోరాయి.

పోలీస్ ఉద్యోగులకు ఆత్మీయ వీడ్కోలు



ఉద్యోగ విరమణ చేసిన సిబ్బందిని సన్మానిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి టౌన్: జిల్లాలో ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ ఉద్యోగులను ఎస్పీ కార్యాలయంలో ఘనంగా వీడ్కోలు పలికారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ సీసీఎస్ ఎస్ఐలుగా విధులు నిర్వహిస్తున్న అజయ్‌కుమార్, ముక్బాల్ బాషా ఉద్యోగ విరమణ చేశారు. బుధవారం తన చాంబర్‌లో ఎస్పీ మాధవరెడ్డి, అడిషనల్ ఎస్పీ విష్ణుతో సిబ్బంది వారిని పూలమాలలతో, శాలువలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ విజయకుమార్, ఎస్బీ సీఐ బాలసుబ్రమణ్యంరెడ్డి, ఏఓ సుజాత, ఆర్ఐలు చంద్రశేఖర్, రవికుమార్, సూపరెండెంట్ సర్వస్వతి పాల్గొన్నారు.

ఫ్యాన్ గుర్తుకు ఓటేయండి



కొత్తచెరువులో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

పుట్టపర్తి టౌన్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జరిగిన మంచిని గుర్తించి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బోయ శాంతమ్మ, దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిని గెలిపించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. బుధవారం వారు కొత్తచెరువులోని పూజారి వీధి, పాత ఎమ్మార్వో ఆఫీస్, పెద్దమ్మ గుడి, ఇసుక వీధి, షిరిడీ సాయిబాబా గుడి ఏరియాలో ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఎంపీపీ గాయిత్రి రెడ్డెప్పరెడ్డి, కాపునాడు జిల్లా అధ్యక్షుడు దాల్‌మిల్ సూరి, వాల్మీకి శంకర్, వైస్ సర్పంచ్ యుగంధర్, నాయకులు సత్తి, వడ్డె నారాయణ, కృష్ణమూర్తి, కేశవ, రఫీ, లక్ష్మిదేవి, పూజారి పెద్దన్న, వెంకటరాముడు, చంద్రాయుడు, అనందాచారి, విష్ణు,రాము, సుదర్శన్, రామాంజి, మాధవ, పవన్, చంద్రమౌళి, సుబ్బారావ్ , ఎల్లప్ప, సంజీవరాయుడు, జాకీర్ పాల్గొన్నారు

బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ

నల్లమాడ: బాసంవారిపల్లికి చెందిన దుద్దుకుంట వెంకటరామిరెడ్డి ఇటీవల మోకాలికి శస్త్ర చికిత్స చేయించుకొని ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి బుధవారం గ్రామానికి వెళ్లి వెంకటరామిరెడ్డిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. అదే గ్రామానికి చెందిన శ్రీనివాసరెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స అనంతరం ఇంటివద్ద కోలుకొంటున్నాడు. అతన్ని ఎమ్మెల్యే పరామర్శించారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక



చరణ్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరుతున్న నాగరాజు

పరిగి: మండలంలోని విట్టాపల్లిలో బుధవారం మంత్రి ఉషశ్రీచరణ్ భర్త చరణ్‌రెడ్డి పర్యటించారు. గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు బీ నాగరాజు ఆ పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. చరణ్‌రెడ్డి ఆయనకు పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. నాయకులు సింగారెడ్డి, శ్రీరామరెడ్డి, దయాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీరాములు, బాబు, బుడేన్, బోయ నాగప్ప తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యం

- మంత్రి ఉషశ్రీచరణ్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీచరణ్



గోరంట్ల: మంత్రి ఉషశ్రీచరణ్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరుతున్న విశ్రాంత ఉపాధ్యాయుడు నాగేనాయక్ తదితరులు

పెనుకొండ: పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని మంత్రి ఉషశ్రీచరణ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్‌సీపీ జెండా పెనుకొండపై రెపరెపలాడేలా చేయాలన్నారు. పెనుకొండ పట్టణంలోని 7వ వార్డులో నగర పంచాయతీ చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్, 4వ వార్డు తయూబ్ ఆధ్వర్యంలో దర్గాపేట, కమాన్‌వీధి, దర్గా మెయిన్ బజార్‌లో వైఎసార్‌సీపీ నాయకులతో కలసి మంత్రి ప్రచారం చేశారు. మంత్రి ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ పెనుకొండ నియోజకవర్గంలో 2.10 లక్షల మందికి ఏకంగా రూ.2,520 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. సీఎం జగనన్న ఆధ్వర్యంలో పార్టీలతో సంబంధం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఎలాంటి సిఫార్సులు లేకుండా సంక్షేమ పథకాలు అందించారన్నారు. వైఎస్సార్‌సీపీని మరోసారి గెలిపిస్తే పేదలకు మరింత మంచి జరుగుతుందన్నారు. చంద్రబాబు మోసపూరిత మాటలు నమ్మవద్దని, ఆయన విడుదల చేసిన మేనిఫెస్టో బూటకమన్నారు. ఆయనను నమ్మితే ప్రజలకు కష్టాలు తప్పవన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ బోయ నరసింహా, జిల్లా కార్యనిర్వాహక సభ్యులు గురురాజ్, నగర పంచాయతీ వైస్ చైర్మన్ సునీల్, కౌన్సిలర్లు సుధాకరరెడ్డి, రఘునాథరెడ్డి, భాస్కర్‌నాయక్, తయూబ్, శేషాద్రి, రామాంజినేయులు, కోఆప్షన్ మెంబర్లు ముహీబా మున్నీర్, నేమతుల్లా, వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐక్యంగా పనిచేయండి

గోరంట్ల: వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా అందరూ ఐక్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్ పార్టీ శ్రేణులకు సూచించారు. బుధవారం మండల పరిధిలోని రెడ్డిచెరువుపల్లి, వడిగేపల్లి, పాలసముద్రం మల్లాపల్లి, పుట్టగుండ్లపల్లి, గడ్డంతాండ, మందలపల్లి గ్రామ పంచాయతీల పరిధిలోని బూత్ కమిటీ కన్వీనర్లు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలతో ఆమె సమావేశమయ్యారు. జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను, మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను ఇంటింటికీ వివరించాలని సూచించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, జెడ్పీటీసీ సభ్యుడు పాలేజయరాంనాయక్, ముఖ్య నాయకులు, ఆయా ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక

మండల మేజర్ పంచాయతీ సర్పంచ్ సరోజబాయి భర్త, నాగేనాయక్ ఉపాధ్యాయ వృత్తికి గుడ్‌బై చెప్పి బుధవారం మంత్రి ఉషశ్రీచరణ్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆయనతో పాటు గోరంట్ల, బూదిలి గ్రామ పంచాయతీలకు చెందిన వారు పెద్ద ఎత్తున పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. అందరికీ మంత్రి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో కాంగ్రెస్ పార్టీ మాజీ మండల కన్వీనర్ బోయ లక్ష్మీనారాయణ, బీజేపీ నాయకుడు చిట్టఖగేంద్ర, బీజేపీ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు నబీరుల్లా , ఆంజనేయులు, ఇబ్రహిం, రాజు, కులశేఖరరెడ్డి, గంగాధర్, సుబ్రమణ్యం, లక్ష్మీపతి, మధన్‌మోహన్‌రెడ్డి, రామంజి, రాము శ్రీనివాసులు, రవినాయక్, గోపాల్‌నాయక్, రామస్వామినాయక్, చరణ్‌నాయక్, శీనానాయక్, వెంకటేశునాయక్, బాలునాయక్, సోమునాయక్ తదితరులు పార్టీలో చేరారు. కార్యక్రమంలో ముఖ్యనాయకులు గంపల రమణారెడ్డి, బూదిలి రవిచంద్రారెడ్డి, రఘురామిరెడ్డి, నార్శింపల్లి శివారెడ్డి, కళ్లాగేరి శంకరరెడ్డి, గోరంట్ల ఉప సర్పంచ్ రాజారెడ్డి, వానవోలు సంఘం విండో అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, పులేరు ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

నగదు, బంగారు చోరీ

సోమందేపల్లి: మండల కేంద్రంలోని నక్కలగుట్ట కాలనీలో గాజుల కృష్ణా ఇంట్లో బుధవారం దొంగతనం జరిగింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగలు తాళాలు పగలగొట్టి బీరువాలోని రూ.10 వేలు నగదు రూ.55 వేలు విలువగల బంగారు నగలు ఎత్తుకెళ్లారు. ఈ మేరకు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఎద్దుల బండిని ఢీ కొన్న ఐచర్

సోమందేపల్లి: మండలంలోని నల్లగొండ్రాయనపల్లి గ్రామ సమీపంలో ఎద్దుల బండిను ఐచర్ వాహనం ఢీ కొన్న సంఘటన బుధవారం చోటు చేసుకుంది. వెలుగమాకులపల్లి నుంచి ఇసుక లోడ్‌తో సోమందేపల్లికు వస్తున్న ఎద్దుల బండిని బెంగళూరు నుంచి వస్తున్న ఐచర్ ఢీ కొంది. ఈ ఘటనలో ఎద్దులు మృతి చెందగా ఎద్దుల బండి యజమాని సుబ్బరాయుడికి గాయలయ్యాయి. అక్కడే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఐచర్ ఢీ కొనడంతో సాయంత్రం వరకు సోమందేపల్లిలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధి పనులపై సమీక్ష

రొద్దం: కూలీలను పెంచడానికి క్షేత్రస్థాయి సహాయకులు బాధ్యతగా పనిచేయాలని ఎంపీడీఓ కేశవరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఏపీఓ అనిల్‌కుమార్, ఈసీ శివ, ప్లాంటేషన్ మనేజర్ నరహరి, టెక్నిల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

జగనన్న పాలన మెచ్చి వైఎస్సార్‌సీపీలోకి..



వైఎస్సార్ సీపీలో చేరిన బాసంవారిపల్లివాసులతో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి



పార్టీలో చేరిన బోడిఎద్దులవాండ్లపల్లివాసులతో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

ఓడీచెరువు : జగనన్న పారదర్శక పాలనకు ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలో చేరినట్లు బోడిఎద్దులవాండ్లపల్లికి చెందిన 20 కుటుంబాలు వారు పేర్కొన్నారు. బుధవారం వారు పుట్టపర్తిలోని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి ఎమ్మెల్యే కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలోకి చేరిన వారిలో లక్ష్మీనరసింహ, రవి, కిష్ట, వెంకటరమణ, శివకుమార్, నవీన్, కిష్టప్ప, శేఖర్, రామాంజనేయులు, నాగరాజు తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రాజు నాయుడు, మండలఅగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ లక్ష్మిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి 30 కుటుంబాలు చేరిక

నల్లమాడ: బాసంవారిపల్లిలో టీడీపీకి చెందిన 30 కుటుంబాల వారు బుధవారం ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఎం. లక్ష్మీపతి, సుగుణమ్మ, ఏ.రఘునాథరెడ్డి, రాధమ్మ, జే.ఓబులప్ప, సరోజమ్మ, ఎం. సరస్వతి, గంగులమ్మ, శ్రీనివాసులు, డీ.రామచంద్రారెడ్డి, ఓబిరెడ్డి, చెన్నక్రిష్టారెడ్డి, బీ. వెంకట్రామిరెడ్డి, కే. ప్రకాష్, వెంకటప్ప తదితరులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. ఎమ్మెల్యే వారికి కండువాలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కే. సూర్యనారాయణ, మాజీ ఎంపీటీసీ మాధవరెడ్డి, పెద్ద తిరుపాల్‌రెడ్డి, రైతు సంఘం నాయకులు మాధవరెడ్డి, చిన్న తిరుపాల్‌రెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, ఉత్తప్ప, గోవిందరెడ్డి, రవీంద్రారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రామకృష్టారెడ్డి, పెద్ద శ్రీనివాసులు తదితర నాయకులు పాల్గొన్నారు.

సొంత గూటికి వైఎస్సార్ సీపీ కార్యకర్తలు

నల్లమాడ: వంకరకుంట గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలు తిరిగి సొంత గూటికి చేరారు. వివరాల్లోకళ్తే..గ్రామానికి చెందిన కూరగాయల రమేష్, పవన్, చాలీషా, కేశవ అనే వైఎస్సార్ సీపీ కార్యకర్తలను ఇటీవల మాజీ ఎమ్మెల్యే పల్లె రఘునాథరెడ్డి బలవంతంగా టీడీపీలో చేర్చుకున్నారు. వారు పల్లెకు షాక్ ఇచ్చి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సమక్షంలో బుధవారం తిరిగి సొంత గూటికి చేరారు. ఎమ్మెల్యే వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. సర్పంచ్ కుల్లాయప్ప, మండల కన్వీనర్ కే. సూర్యనారాయణ, నాయకులు ఓబిరెడ్డి, పీవీ భాస్కర్‌రెడ్డి, చిన్నాగప్ప, హైదరాబాద్ ఓబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమడగూరు: పూలకుంటపల్లికి చెందిన 15 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలోకి చేరాయి. బుధవారం అమడగూరు చౌడేశ్వరీ కల్యాణమండపం వద్ద ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఇదిలా ఉండగా గువ్వలపల్లికి చెందిన వార్డు మెంబర్ రమణ అనారోగ్యంతో బాదపడుతుండగా ఎమ్మెల్యే ఆయన గృహానికి వెళ్లి పరామర్శించాడు.

కొత్తచెరువులో టీడీపీకి ఎదురు దెబ్బ

పుట్టపర్తి: కొత్తచెరువులో టీడీపీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. 52 కుటుంబాలు ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సమక్షంలో బుధవారం టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరాయి. పుట్టపర్తిలో తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వారికి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. గ్రామానికి చెందిన ఆదినారాయణ, సింహాద్రి, శ్రీనివాసులు, గంగాద్రి, జానకంపల్లి శ్రీనివాసులు, వెంకటప్ప, నారాయణప్ప, నరేంద్ర, వెంకటేష్, దీక్షిత్, అర్జున్, నరసింహ, మధు, భాను, మురళి,గణేష్, అజయ్, మంజునాథ్, కార్తీక్, సాయి, అశోక్, విష్ణు, ఆదినారాయణ, చంద్రమోహన్ పార్టీ సీనియర్ నేత దాల్ మిల్ సూరి అధ్వర్యంలో పార్టీలో చేరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నారాయణ, వైస్ సర్పంచ్ యుగంధర్, క్రిష్ణమూర్తి, తిరుపాల్, చెన్నకేశవులు పాల్గొన్నారు.



పూలకుంటపల్లివాసులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి



సొంత గూటికి చేరిన కార్యకర్తలతో ఎమ్మెల్యే దుద్దుకుంట



వైఎస్సార్‌సీపీలో చేరిన కొత్తచెరువువాసులతో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

జగనన్నను మరోసారి ఆశీర్వదించండి



సోమందేపల్లిలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



గుట్టూరులో ప్రచారం చేస్తున్న చరణ్‌రెడ్డి

సోమందేపల్లి: మండలంలోని డీ.ఎల్ రోడ్డు, పాత ఊరు, చాకర్లపల్లి గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సంక్షేమాభివృద్ధిని వివరించి ఎంపీ అభ్యర్థి శాంతమ్మ, ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్‌కు ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణరెడ్డి, మాజీ కన్వీనర్ వెంకటరత్నం, జెడ్పీటీసీ సభ్యుడు అశోక్, వైస్ ఎంపీపీ వెంకటనారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ రమాకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ రూరల్: సంక్షేమ సారథి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని మంత్రి ఉషశ్రీచరణ్ భర్త చరణ్‌రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మండలంలోని గుట్టూరులో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరారు. కార్యక్రమంలో వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ పొగాకు రామచంద్ర, సర్పంచ్ నాగరత్నమ్మ, ఎంపీటీసీ నిర్మల, మండల కన్వీనర్ బాబు, నాయకులు రామ్మోహన్‌రెడ్డి, సుధాకర్ రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, దుర్గప్ప, రవి, నారాయణస్వామి, పిట్టాబాబు, రెడ్డప్ప, రిజ్వాన్, బషీర్ తదితరులు పాల్గొన్నారు.

రొద్దం: మండలంలోని దొడ్డకంపల్లి, బూచెర్ల, గౌరాజుపల్లి తదితర గ్రామాల్లో బుధవారం వైఎస్సార్‌సీపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. నాయకులు అక్కులప్ప, బి.నారాయణరెడ్డి, మండల కన్వీనర్ తిమ్మయ్య, ఎస్ నారాయణరెడ్డి, రాజారెడ్డి, నరసింహులు, సి.నారాయణరెడ్డి, మారుతిరెడ్డి, రాజ్‌గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిగి: మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రచారంలో దూసుకెళ్తున్నారు. బుధవారం పలు గ్రామాల్లో ఆ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు ప్రచారం చేశారు. సంక్షేమాభివృద్ధిని వివరించి ఫ్యాన్‌గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు. ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు ఉషశ్రీచరణ్, బోయ శాంతమ్మలను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు.



రొద్దం మండలం గౌరాజుపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు



పరిగిలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

అభివృద్ధికి బాటలు వేసిన శ్రీధరన్నను ఆశీర్వదించండి



ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరుతున్న కిషన్‌రెడ్డి



నాయకులకు సంఘీభావం తెలుపుతున్న అటవీ గ్రామ ప్రజలు

ఓడీచెరువు: పుట్టపర్తి నియోజకవర్గ అభివృద్ధికి బాటలు వేసిన ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని ఆయన తనయుడు దుద్దుకుంట కిషన్‌రెడ్డి ప్రజలను కోరారు. బుధవారం ఆయన తంగేడుకుంట పంచాయతీలోని లింగాలవారిపల్లి, గొల్లవారిపల్లి, బలిజపల్లి, నల్లచెరువుపల్లి, యం.ఎర్రబల్లిలో ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఫ్యాను గుర్తుకు ఓటు వేసి శ్రీధర్‌రెడ్డితో పాటు ఎంపీ అభ్యర్థి బోయ శాంతమ్మను గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీనివాస రెడ్డి, బాబుస్వామి, సర్పంచులు అభిదా, రంగారెడ్డి, ఎంపిటీసీ రమణ, నాయకులు సుధాకర్, చింతా వెంకటేశ్, మధు, రఫీ, సనత్‌స్వామి, శ్రీనివాసరెడ్డి, మనోహర్ రెడ్డి, కిశోర్, అంజి, నరసింహరెడ్డి, బయపరెడ్డి,పురుషోత్తం రెడ్డి, రామస్వామి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అటవీ గ్రామాల్లో అపూర్వ స్వాగతం

పుట్టపర్తి అర్బన్: మండలంలోని అటవీ గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ ప్రచారానికి ప్రజల నుంచి అపూర్వ స్వాగతం లభించింది. బుధవారం గంగిరెడ్డిపల్లి, దిగువచెర్లోపల్లి, సాతార్లపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే బావమరిది రాఘవరెడ్డి, ఎంపీపీ ఏవీ రమణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు లక్ష్మీనరసమ్మ, పరిశీలకులు మాధవరెడ్డి, ఫోటో సాయి వెళ్లగా ఆయా గ్రామాల ప్రజలు ఘన స్వాగతం పలికారు. గతంలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి తమ గ్రామాలకు రోడ్లతో పాటు ఆర్టీసీ బస్సు ఏర్పాటు చేయడంతోపాటు అభయాంజనేయస్వామి ఆలయాన్ని పునరుద్ధరించాలని వారు గుర్తు చేశారు. శ్రీధర్‌రెడ్డితోపాటు ఎంపీ అభ్యర్థి బోయ శాంతమ్మను భారీ మెజార్టీతో గెలిపిస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో సర్పంచ్ కామాక్షమ్మ, ఎంపీటీసీ కుల్లాయప్ప, మాజీ మండల కన్వీనర్ గంగాద్రి, కన్యాకుమారి, నాయకులు ఆదెప్ప, వెంకటేషు, శంకరరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, హనుమంతరెడ్డి, మురళీధరరెడ్డి తదితరులు ఉన్నారు.

ఫ్యాన్ గుర్తుకు ఓటేయండి

పుట్టపర్తి రూరల్: అభివృద్ధి, సంక్షేమం కోసం రెండు బటన్లను ఫ్యాను గుర్తుపై నొక్కాలని దుద్దుకుంట అపర్ణారెడ్డి ప్రజలను కోరారు. బుధవారం పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లి, ఎనుములపల్లి వార్డులో అమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పూలు చల్లుతూ ప్రజలు అమెకు హారతులు పట్టి మహిళలు, స్థానిక ప్రజలు ఆమెకు స్వాగతం పలికారు. ఎమ్మెల్యే అభ్యర్థి దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి శాంతమ్మను గెలిపించాలని కోరారు. ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఘనంగా మే డే

పుట్టపర్తి టౌన్: మే డే స్ఫూర్తిగా కార్మికులు తమ హక్కుల సాధనకు ఉద్యమించాల్సిన అవసరం ఉందని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈసీ వెంకటేష్ పేర్కొన్నారు. మే డే సందర్భంగా బుధవారం పట్టణంలోని చిత్రావతి బ్రిడ్జి నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు సీఐటీయూ నేతలు ర్యాలీ చేపట్టారు. మున్సిపల్ కార్మికులందరూ కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో సీపీఎం, సీఐటీయూ , సీపీఐ నాయకులు బ్యాళ్ల అంజి, అంజనేయులు, ఓబిరెడ్డి, నాగరాజు, శినివాసులు, మున్సిపల్ కార్మికులు రామయ్య,పెద్దన్న , గోవిందు , నరశింహులు, నాగార్జున, సాయి పాల్గొన్నారు



మాట్లాడుతున్న అదనపు జిల్లా న్యాయమూర్తి శైలజ

హక్కులతో పాటే బాధ్యతలు

పరిగి: కార్మికులు హక్కులతో పాటే బాధ్యతలు గుర్తించినప్పుడే ఆ సంస్థ పురోభివృద్ధి సాధిస్తుందని అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ పేర్కొన్నారు. బుధవారం కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని కొడిగెనహళ్లి ఫ్రీకాట్‌మిల్ ఆవరణంలో జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. ఒక సంస్థ బాగుండాలంటే కార్మికులు ఆరోగ్యంగా ఉండాలని ఇందుకు సంస్థ ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కార్మికులు వ్యక్తిగత, సామాజిక సమస్యలను ఎలాంటి ఖర్చు లేకుండా కోర్టు ద్వారా పరిష్కరించుకొనే అవకాశం ఉందన్నారు.